పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపర్చాలి

డిఇఒకు ఆచంట ఎంఎల్ఎ పితాని సూచన

ఆచంట: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యాబోధన మెరుగుపరచాలని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ సూచించారు. గురువారం పోడూరు మండలం కొమ్ముచిక్కాలలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పితాని సత్యనారాయణను డిఇఒ నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా సైన్స్‌ఫెయిర్‌కు హాజరు కావాలని పితానిని డిఇఒ ఆహ్వానించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆచంట, పెనుమంట్ర ఎంఇఒలు ఎ.ఉషారాణి, పి.రాజేంద్రప్రసాద్, వై.లక్ష్మీనారాయణ,ఉంగరాల నాగేశ్వరరావు, ఎడ్యుకేషనల్ సీనియర్ అసిస్టెంట్ పి.కుమారస్వామి పాల్గొన్నారు.

మహాసభకు వేళాయె..!

నేటి నుంచి మూడు రోజులపాటు
సిపిఎం 26వ జిల్లా మహాసభ
ఎర్రజెండాలు, తోరణాలతో భీమవరం ముస్తాబు
ప్రధాన కేంద్రాల్లో సిపిఎం జెండాల రెపరెపలు
3న వేలాది మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ
4, 5 తేదీల్లో ప్రతినిధుల సభ
జిల్లాలో సమస్యలపై 20 అంశాలతో కూడిన తీర్మానాలు
మహాసభకు ఏర్పాట్లన్నీ పూర్తి
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

యనమదుర్రు వంతెనపై ఆకర్షణీయంగా ఉన్న స్వాగత ద్వారం

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా 26వ మహాసభ భీమవరంలో నేటి నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. మహాసభకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. మహాసభ నేపథ్యంలో భీమవరం పట్టణం ముస్తాబైంది. ఎర్రజెండాలు, తోరణాలతో ముస్తాబు చేశారు. మహాసభకు సంబంధించి ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో కరపత్రాలను పంచిపెట్టారు. ఆటోల్లో మైకు ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా భీమవరం పట్టణాన్ని ఎర్రజెండాలు తోరణాలతో అలంకరించారు. మురుగుకాల్వ వంతెనలు ఇరువైపులా మహాసభ గేట్లు ఏర్పాటు చేశారు. ఓవర్‌బ్రిడ్జి, బస్టాండ్ సెంటర్, జెపి రోడ్, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, ప్రకాశం చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, పోలీస్ బొమ్మ సెంటర్, ఆదివారం బజార్, అభిరుచి సెంటర్ వంటి ప్రధాన కేంద్రాల్లో సిపిఎం జెండాలు తోరణాలతో అలంకరించారు. సభా ప్రాంగణాన్ని, వేదికను ఎర్రజెండాలు, తోరణాలతో అందంగా అలంకరించారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ముగింపు, సిపిఎం జిల్లా 26వ మహాసభ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం పట్టణంలో వేలాది మందితో భారీ ప్రజా ప్రదర్శన చేపట్టనున్నారు. ఈ సందర్భంగా వేలాది మంది అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించేలా ఏర్పాట్లు చేశారు. ఇదే రోజు సాయంత్రం పాత బస్టాండ్ వద్ద భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ మహాసభ ప్రాంగణానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం మహాసభలో ప్రసంగించనున్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ప్రతినిధుల సభ జరగనుంది. ప్రతినిధుల సభ జరిగే ప్రాంతానికి అమరజీవి రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) నగర్, అమరజీవి వలవల శ్రీరామ్మూర్తి ప్రాంగణంగా నామకరణం చేశారు. పట్టణ, మండల మహాసభలో ఎన్నికైన ప్రతినిధులు, పరిశీలకులు, ఆహ్వానితులు కలిపి సుమారు 300 మంది ప్రతినిధుల సభకు హాజరుకానున్నారు. సిపిఎం సీనియర్ నేత, చించినాడ పోరాటయోధుడు కేతా సూర్యారావు ప్రతినిధుల సభ ప్రారంభ సూచికగా జెండా ఆవిష్కరించనున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రతినిధుల సభలో గత మూడేళ్ల నుంచి జరిగిన పోరాటాలు, కార్యకలాపాలను సమీక్షించనున్నారు. రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టబోయే భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను రూపకల్పన చేసేందుకు సమగ్రంగా చర్చించనున్నారు. జిల్లా అభివృద్ధి, ఉపాధి అవకాశాల్లో భాగస్వామ్యంగా ఉన్న రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితులను ఆదుకుని ప్రాజెక్టు పూర్తి చేయడం వంటివి ప్రధాన డిమాండ్లుగా మహాసభ జరుగుతున్నాయి.

ముఖ్యంగా రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్కీమ్‌వర్కర్లు సమస్యలతోపాటు ప్రత్యేకంగా సామాజిక అంశాలు, దళితులు, శ్మశానవాటిక సమస్యలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు వంటి సమస్యలపై వివిధ అంశాలతో కూడిన 20 తీర్మానాలను మహాసభలో చర్చించి ఆమోదించనున్నారు. మహాసభ చివరి రోజు నూతన కమిటీ, సెక్రటేరియేట్, నూతన జిల్లా కార్యదర్శి ఎన్నిక జరుగుతుంది.

ప్రజా ప్రదర్శన సాగేదిలా..

భీమవరం కొత్త బస్టాండ్ సమీపాన ఉన్న కేశవరావు హైస్కూల్ వద్ద నుంచి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు వేలాది మందితో భారీ ప్రజా ప్రదర్శన ప్రారంభం కానుంది. జిల్లా నలుమూలల నుంచి ఎంపికైన ప్రతినిధులు, సిపిఎం నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు, కార్మికులు, కర్షకులు, స్కీమ్‌వర్కర్లు, వివిధ రంగాల ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజానీకం సైతం వేలాది మంది ఈ ప్రదర్శనలో పాల్గొనున్నారు. కేశవరావు హైస్కూల్ నుంచి అన్నపూర్ణ థియేటర్ రోడ్డు మీదుగా సీతయ్య పలావు సెంటర్, పోలీస్ బొమ్మ సెంటర్, ప్రకాశం చౌక్, అంబేద్కర్ చౌక్, బాంబే స్వీట్ సెంటర్, గాంధీచౌక్ మీదుగా పాత బస్టాండ్ వరకూ ఈ భారీ ప్రజాప్రదర్శన సాగనుంది. అక్కడ భారీ బహిరంగ సభ జరగనుంది.

మహాసభ ప్రధాన డిమాండ్లు..

★ పార్లమెంట్లో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. అల్లూరి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి.

★ ఆక్వా యూనివర్సిటీకి అల్లూరి పేరు పెట్టాలి.

★ చించినాడ బ్రిడ్జికి, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలుకు అల్లూరి పేరు పెట్టాలి.

★ భీమవరం పాత బస్టాండ్ పక్కనే గతంలో ఉన్న అల్లూరి భవనం స్థలంలో నాలుగు అంతస్తుల అల్లూరి సీతారామరాజు కళా సాంస్కృతిక భవనాన్ని నిర్మించాలి.

★ జిల్లా అభివృద్ధి, ఉపాధి అవకాశాల్లో భాగంగా ఉన్న రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితులను ఆదుకుని, ప్రాజెక్టును పూర్తి చేయాలి.

మహాసభకు ఏర్పాట్లన్నీ పూర్తి..

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

భీమవరం పట్టణంలో సిపిఎం 26వ జిల్లా మహాసభ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. భారీ ప్రజా ప్రదర్శనతోపాటు భారీ బహిరంగ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలి రానున్నారు. రెండు రోజులపాటు జరిగే ప్రతినిధుల సభలో ఇప్పటి వరకు జరిగిన ఉద్యమాల తీరు, రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టబోయే పోరాటాల భవిష్యత్తు ప్రణాళికపై చర్చిస్తాం. జిల్లాలో కాలుష్య సమస్య తీవ్రంగా ఉంది. రోగాలు పెరిగిపోవడంతో జిల్లా రెడ్‌జోన్‌లో ఉంది. కాలుష్యానికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమానికి మహాసభలో రూపకల్పన చేయనున్నాం. డెల్టా ఆధునికీకరణ, రైతులు, వ్యవసాయదారులు, వృత్తిదారులు, కౌలురైతులు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్కీమ్‌వర్కర్లతోపాటు ప్రత్యేకంగా సామాజిక అంశాలు వంటి సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి మార్గాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగనున్నాం.

800 సీసీ కెమెరాల ఏర్పాటు

సంక్షేమ హాస్టళ్లకు 400 బెడ్స్
6, 7 తేదీల్లో మంత్రులు లోకేష్, సత్యకుమార్ రాక
డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు

సర్కిల్ పోలీస్ స్టేషన్ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

నేరాల సంఖ్యను పూర్తిగా అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నామని, అందులో భాగంగా నియోజకవర్గంలో 800 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. స్థానిక సిఐ కార్యాలయ నూతన భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ పూర్తిస్థాయిలో పని చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య భారీగా తగ్గుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు పోలీసు స్టేషన్లకు తన స్నేహితుడు, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సహకారంతో రూ.కోటి విలువైన నాలుగు వాహనాలను అందించామన్నారు. జిల్లాలో పలుచోట్ల సంక్షేమ హాస్టళ్లకు అవసరమైన 400 బెడ్‌లను వారం రోజుల్లో అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి ప్రధాన నీటివనరు పరిమెళ్ల వాటర్ స్కీమ్ మరమ్మతుకు చర్యలు చేపడుతున్నామని, కాల్వల్లోకి మురుగునీరు ప్రవహించకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డ్‌ను ఇప్పటికే సరి చేశామని, త్వరలో ఆ ప్రాంతంలో పార్క్ నిర్మాణం చేపడతామని చెప్పారు. డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసును మూడు రోజుల్లోనే ఛేదించిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, ఎస్‌పిని అభినందించారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న సిబ్బంది అందరికీ జ్ఞాపికలు అందజేశారు.

6న మంత్రి లోకేష్ భీమవరం రాక

ఈ నెల ఆరో తేదీన మంత్రి లోకేష్ భీమవరం రానున్నారని రఘురామకృష్ణంరాజు తెలిపారు. భీమవరం పెదఅమిరం సెంటర్లో ఏర్పాటు చేసిన రతన్‌టాటా కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఉండి జెడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని, చెప్పారు.

7న మంత్రి సత్యకుమార్ ఆకివీడు రాక

ఈ నెల ఏడో తేదీన రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆకివీడు రానున్నారని రఘురామకృష్ణంరాజు తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్ర ఆసుపత్రికి అదనంగా నిర్మించిన నూతన భవనాన్ని ఆయన ప్రారంభిస్తారన్నారు. ఇదే సందర్భంగా చెరుకుమిల్లి దాతలు అందించిన రూ.50 లక్షల వ్యయంతో సిద్ధం చేసిన డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో ఐజి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో పోలీసులకు సహకారం అందించి అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి అద్నాన్ నయీం ఆస్మీ, ఎఎస్‌పి భీమారావు, ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, టిడిపి మండలాధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, జనసేన నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు, గవర లక్ష్మి అనిల్, బిజెపి నాయకులు ఎం.నాగమణి పాల్గొన్నారు.

'వాటర్‌గ్రిడ్' పట్టాలెక్కేనా..!

గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా జనం గొంతు తడిపే తాగునీటి పథకం 'వాటర్‌గ్రిడ్' పట్టాలెక్కేనా అనే చర్చ రెండు జిల్లాల ప్రజానీకంలో మళ్లీ మొదలైంది. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లపాటు అదిగో.. ఇదిగో అంటూ వాటర్ గ్రిడ్ పథకంపై మోసగించింది. ఆ కోపంతోనే గడిచిన ఎన్నికల్లో రెండు జిల్లాల్లో ఉన్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను కూటమికి కట్టబెట్టిన ప్రజలు తమ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని ఎదురుచూస్తున్నారు. జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన సిఎం, డిప్యూటీ సిఎంలు ఆ దిశగా అడుగులు వేస్తారా.. లేక వైసిపి మాదిరిగా ఊరించి ఉసూరుమన్పిస్తారో వేచిచూడాలి.

రెండు జిల్లాల్లోనూ అధ్వానంగా తాగునీరు
తాగునీటికి నెలకు రూ.72 కోట్లు వెచ్చిస్తున్న జనం
పైప్‌లైన్ ద్వారా గోదావరి జలాలు సరఫరా ఎప్పుడు..?
ఐదేళ్లపాటు మాటలతో సరిపెట్టిన వైసిపి సర్కార్
అంచనాలు రూ.3,670 కోట్ల నుంచి రూ.1400 కోట్లకు కుదింపు
కూటమి ప్రభుత్వమైనా ప్రజల గోడు పట్టించుకునేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లో విచ్చలవిడిగా సాగిన చేపల చెరువుల తవ్వకాలతో సాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. ముఖ్యంగా డెల్టా మండలాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. దాదాపు దశాబ్దంన్నరకాలంగా తాగునీటి కోసం పశ్చిమ, ఏలూరు జిల్లా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడిపోతున్నారు. డబ్బు చెల్లించి కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితి నెలకొంది. ప్రతి కుటుంబం రోజుకు దాదాపు రూ.20 నుంచి రూ.40 వరకూ తాగునీటి కోసం ఖర్చు చేయాల్సిన దుస్థితి దాపురించింది. పంచాయతీ పరిధిలోని తాగునీటి ట్యాంకుల ద్వారా అందించే నీరు తాగడానికి ఏమాత్రం పనికిరాని పరిస్థితి ఉంది. చేపలు, రొయ్యల చెరువుల్లో నీటిని పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఆ నీటినే తాగునీటి చెరువుల్లో నింపుతున్నారు. పసర్లు కమ్మిన నీటిని తాగలేక దాహర్తి తీర్చుకునేందుకు నీళ్లు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండు జిల్లాల్లో దాదాపు 30 లక్షలకుపైగా జనాభా ఉన్నారు. రేషన్‌కార్డుల ప్రాతిపదికన చూస్తే 12 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఒక్కో కుటుంబం రోజుకు రూ.20 చొప్పున తాగునీటికి ఖర్చు చేస్తున్నట్లు లెక్కించినా రోజుకు రూ.2.40 లక్షలు, నెలకు రూ.72 కోట్లు తాగునీటికే జిల్లా ప్రజానీకం ఖర్చు చేస్తున్న పరిస్థితి ఉంది. 2019 ఎన్నికల ప్రచారంలో జిల్లాలో తాగునీటి సమస్యనే ప్రధాన ఎజెండాగా సాగింది. ఎన్నికల ముందు జిల్లాలో పాదయాత్ర నిర్వహించిన వైసిపి అధ్యక్షుడు జగన్ బాటిల్‌లో నీళ్లు చూపించి ఈ నీటిని మనుషులు తాగుతారా అంటూ అప్పటి టిడిపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే వాటర్ గ్రిడ్ పథకం ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామంటూ హామీ ఇచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా 13 చోట్ల ఎంఎల్ఎ, రెండు ఎంపీ స్థానాల్లో వైసిపి అభ్యర్థులను ప్రజలు గెలిపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్‌గ్రిడ్‌పై వైసిపి సర్కార్ హడావుడి చేసింది. మొత్తం రూ.3,670 కోట్లతో అంచనాలు రూపొందించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని గ్రామాలకూ వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పింది. కొన్నాళ్లకు మళ్లీ అంచనాలు సవరించి డెల్టా వరకూ మాత్రమే పరిమితం చేసి అంచనా వ్యయం రూ.1400 కోట్లకు కుదించింది. అయినా ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

తాగునీటి కల నెరవేరేనా..?

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రజల తాగునీటి కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చేనా అనే చర్చ జనాల్లో సాగుతోంది. గోదావరి నదిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం, ఆరికరేవుల, పట్టిసీమ మొత్తం ఐదుచోట్ల పంపింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి పైప్‌లైన్ ద్వారా తాగునీరు ఇచ్చేలా వాటర్‌గ్రిడ్ పథకానికి రూపకల్పన చేసింది. నరసాపురం, భీమవరం ప్రాంతాల మీదుగా ఒక పైప్‌లైన్, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు వరకూ ఒకటి, పోలవరం నుంచి జంగారెడ్డిగూడెం, చింతలపూడి, లింగపాలెం వరకూ ఇంకో పైప్‌లైన్, కొవ్వూరు, గోపాలపురం, నల్లజర్ల మీదుగా మరో పైప్‌లైన్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. పైప్‌లైన్ల మధ్యలో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు సైతం ఏర్పాటు చేసి రక్షిత తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు. వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటుకు సంబంధించి సర్వేలు సైతం జరిగాయి. వైసిపి ఐదేళ్ల పాలనలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సైతం గడిచిన ఎన్నికల్లో స్వచ్ఛమైన తాగునీటిని జిల్లా ప్రజలకు అందిస్తామని హామీలు గుప్పించారు. దీంతో జిల్లా ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. గడిచిన ఎన్నికల్లో కూటమికి అన్ని సీట్లనూ కట్టబెట్టారు. గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరాపై జిల్లా ప్రజల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందో, లేదో వేచిచూడాలి. ఏదేమైనా జిల్లా ప్రజలను దీర్ఘకాలంగా వెంటాడుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని అంతా కోరుతున్నారు.

నరసాపురం-మచిలీపట్నం రైల్వేలైన్ డిపిఆర్ సిద్ధం

వచ్చే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు - కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ


కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొవ్వలి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం-మచిలీపట్నం మధ్య తలపెట్టిన కొత్త రైల్వేలైన్ పనులకు డిపిఆర్ సిద్ధమైందని, రానున్న బడ్జెట్లో ఈ ప్రాజెక్టుకు నిధులు కూడా విడుదలయ్యే ఛాన్స్ ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం నరసాపురంలోని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజారామ్మోహన్‌నాయుడు నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్ జాప్యానికి నిధులు, భూసేకరణే కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో ఇవ్వాల్సిన వాటా మొత్తంలో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఈ బడ్జెట్లో విడుదలయ్యే నిధులతో ఈ పనులు వేగవంతమవుతాయన్నారు. గత ఐదేళ్ల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటాలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రాల మధ్య మంచి సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. నరసాపురం-వారణాసి మధ్య కొత్త రైలు, నరసాపురం-సికింద్రాబాద్ మధ్య వందేభారత్ రైలు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. త్వరలో భీమవరం-చెన్నయ్ మధ్య వందేభారత్ రైలు తీసుకొస్తామన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి రూ.10 కోట్లు కేంద్రం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. ప్రయివేట్ ఏజెన్సీలకు నిర్వహణా బాధ్యతలను అప్పగిస్తామన్నారు. తణుకు, తాడేపల్లిగూడెంల్లోని డయాలసిస్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని శ్మశానవాటికలకు ప్రహరీల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. ముందుగా కేంద్ర మంత్రి వర్మను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, ట్రస్ట్ కోశాధికారి జయలక్ష్మి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్, సంకు భాస్కర్ నాయుడు, బొమ్మిడి సునీల్, గునిశెట్టి రామకృష్ణ, మల్లాడి మూర్తి పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆహ్వాన సంఘం

యువజనోత్సవాల రూపకర్త డివైఎఫ్ఐనే

సంక్రాంతి యువజనోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ ప్రతాప్‌కుమార్

ప్రజాశక్తి - ఆకివీడు

యువజనోత్సవాలకు రూపకల్పన చేసి, నిర్వహణ ప్రారంభించింది డివైఎఫ్ఐనే అని, ఆ తర్వాతే కేంద్ర ప్రభుత్వం యువజనోత్సవాలను ప్రారంభించిందని డివైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ పిబి.ప్రతాప్‌కుమార్ అన్నారు. ప్రతియేటా డివైఎఫ్ఐ నిర్వహించే సంక్రాంతి యువజనోత్సవాల వివరాలు వెల్లడించడానికి గురువారం ప్రతాప్‌కుమార్ తన ఆసుపత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ 42 సంవత్సరాల నుండి నిర్విరామ కృషితో ఈ యువజనోత్సవాల నిర్వహణలో డివైఎఫ్ఐ విజయం సాధించిందన్నారు. మొదట్లో రెండు, మూడు అంశాలతో ప్రారంభించి ఇప్పుడు 10 అంశాల్లో పోటీల నిర్వహణ అభినందనీయమన్నారు. సమాజంలో విచ్చలవిడిగా పెరిగిన మాదకద్రవ్యాల వినియోగం నిరోధానికి డివైఎఫ్ఐ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఆహ్వాన సంఘం కార్యదర్శి గేదెల ధనుష్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోనూ మినీ స్టేడియం నిర్మాణం తమ ప్రధాన డిమాండ్ అని తెలిపారు. యువజనోత్సవాల కన్వీనర్ డోకల రవితేజ మాట్లాడుతూ క్రీడాపోటీలు ఈ నెల ఎనిమిదో తేదీ నుండి 16వ తేదీ వరకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతాయన్నారు. 8వ తేదీన దుంపగడప కళాశాల క్రీడా ప్రాంగణంలో క్రికెట్ పోటీలతో యువజనోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పోటీలు నాలుగు రోజులు జరుగుతాయన్నారు. 13, 14వ తేదీల్లో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలస్థాయి వాలీబాల్ పోటీలు, 13వ తేదీ సాయంకాలం ఐదు గంటలకు ట్రాక్ ఆధారంగా జిల్లాస్థాయిలో పాటల పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. 14, 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు, 14వ తేదీ ఉదయం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయి చెస్ పోటీలు, అదేరోజు మధ్యాహ్నం ఐద్వా ఆధ్వర్యంలో రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్, మహిళల ఆటల పోటీలు జరుగుతాయని చెప్పారు. నేత బి.రాంబాబు మాట్లాడుతూ ఈ పోటీలను దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని, క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

దూసనపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.విజయ్‌కుమార్ (61) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. దూసనపూడి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించడంలో విజయకుమార్ ఎంతో కృషి చేశారని మాజీ సర్పంచి దాడి కాశీనాయుడు తెలిపారు. విజయకుమార్ మృతికి సర్పంచి యర్రంశెట్టి నాగసాయి, ఎంఇఒ-2 ఎం.శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు సుదర్శన్‌కుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - తణుకు

ప్రజలు నేడు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలూ పరిష్కారం కావాలంటే పోరాటాలే మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి మాట్లాడుతూ సిపిఎం ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా నిత్యం ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. పోరాడితే పోయేదేమీలేదన్నారు. అధికారంలో ఉన్న వారు, నేడు దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు, రైతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు బేషరత్‌గా రద్దు చేయాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని తెలిపారు. స్కీమ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుబ్బల గోపి, గార రంగారావు, కె.నాగరత్నం, వెంకటేశ్వరరావు, పి.ఉష, ఆకుల శేషుబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం పెనుమంట్రలో మనబడి మన భవిష్యత్తు నిధులు రూ.34.86 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, నూతన విద్యా విధానంలో నూతన పోకడలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాన్ని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వై.లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, నాయకులు గంటా వాసు, యర్రా రాధే గోపాల్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోరుకొనే ప్రభుత్వమని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. వెలగలవారిపాలెం గ్రామంలో గురువారం రూ.43.50 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎంఎల్ఎ పితాని, పెనుమంట్ర వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఛైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి వెలగల సుగుణ, ఎంపిటిసి సభ్యురాలు మంద్రు శాంత కుమారి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గణపవరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం వాకపల్లిలో మురుగుకాలువ పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి తగు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో అన్ని వసతులూ కల్పించడంలో కూటమి ప్రభుత్వం ముందుందన్నారు. వాకపల్లిలో ఎన్నో ఏళ్లుగా మురుగుకాలువలో పూడుకతీయక పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు గ్రామంలో పారిశుధ్యం క్షీణించకుండా ఉండేందుకు మురుగుకాలువ పూడుకతీత పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆదిమూలం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కె.చక్రవర్తి, నేతలు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్ ప్రమాణం

భీమవరం టౌన్: రాష్ట్ర రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన ఉప్పులూరి చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని బిసి భవన్‌లో రజక ఎంఎల్‌సి డి.రామారావు గుంటూరు, పశ్చిమ శాసన సభ్యురాలు గల్లా మాధవి గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తి అగ్నికుల క్షత్రియ ఛైర్మన్ పాపారావు ముఖ్యఅతిథులుగా కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవ సభలో చంద్రశేఖర్ మాట్లాడారు. టిడిపిలో సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అనేక పదవీ బాధ్యతలు నిర్వహించిన తనకు నేడు రాష్ట్ర డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఉఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మంత్రులు, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో భీమవరం నుంచి టిడిపి నాయకులు చింతాడ శ్రీనివాస్, చించినాడ శ్రీనివాస్, పోడూరి వెంకటరమణ, జామి రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా వెంకట సత్యనారాయణ పుట్టినరోజు

పాలకొల్లు : పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ అల్లు వెంకట సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా గురువారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు మెయిల్‌లో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఎంఎల్ఎ బాబ్జి, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వంగా నరసింహారావు, ప్రదాన కార్యదర్శి జిఎస్ఎన్ మూర్తి స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్ఎన్ఎం ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పాలకొల్లు : పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ డిసెంబర్ 3వ వారంలో ఈ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామని వివరించారు. మొదటి సెమిస్టర్‌లో మొత్తం 219 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 75.80 శాతంతో 166 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.కష్ణ, ఎగ్జామ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో సమస్యలు పరిష్కారం

పెనుగొండ: గ్రామ సభల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తామని పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోనీ అన్నారు. గురువారం పంచాయతీ ఆవరణలో గ్రామ సమస్యలను అధికారులకు వివరించారు. పెనుగొండలో డ్రెయినేజీ, పారిశుధ్యం సమస్యలు ఎక్కువగా ఉన్నాయని పలువురు మాట్లాడారు. ఈ సమస్యలను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ నిధుల నుంచి 30 శాతం కార్మికులకు జీతాలు ఇవ్వాలని, అయినప్పటికీ పెనుగొండ మేజర్ పంచాయతీ కావడంతో 20 వార్డుల్లో కార్మికులు తక్కువగా ఉండడంతో కొత్త కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు.

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 10 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ కె.నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి అర్జీదారునికి న్యాయం చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ, గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ, టిడిపి గ్రామ అధ్యక్షులు కందుల రాధా బలరామకృష్ణ శ్రీనివాస్ యాదవ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో కమిషనర్ తనిఖీ

నరసాపురం: నరసాపురంలోని మునసబుగారి వీధి అర్బన్ పిహెచ్‌సిని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి అనంతరం సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలను వైద్య సేవలపై ఆరాతీశారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయి, సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులుంటే తెలియజేయాలని పేషెంట్లకు కమిషనర్ సూచించారు. అనంతరం ఆయన పలు పరీక్షలు చేయించుకున్నారు.

గొప్ప నాయకుడు సూర్యచంద్రరావు

నరసాపురం: డీలర్ల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడు పెరమళ్ల సూర్యచంద్రరావు అని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. గురువారం పట్టణంలోని శివాలయం రోడ్లో నిర్వహించిన సంస్మరణ సభకు ఆయన అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లా నుంచి రాష్ట్ర నాయకుడిగా వెళ్లిన ఆయన అక్కడ కూడా రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు దివిలీలా మాధవరావు, వాసురెడ్డి నర్సింహారావు, అధికారి ఏసు పాల్గొన్నారు.

అన్ని కాల్వలనూ ప్రక్షాళన చేస్తాం


మాట్లాడుతున్న ఫణిబాబు, సాయిలచ్చిరాజు

ఉండి: ఉండి డిసి పరిధిలోని అన్ని కాల్వలను ప్రక్షాళన చేయిస్తామని ఉండి డిసి అధ్యక్షులు తోట ఫణిబాబు, ఉపాధ్యక్షులు మంతెన సాయిలచ్చిరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఉండి ఇరిగేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్న అనంతరం వారు మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ కాకుండా రైతు వారి విధానంతో రైతులకు మేలు చేకూరే విధంగా అన్ని కాల్వలను ప్రక్షాళన చేయించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పంట కాలువల మురుగు కాలువల ప్రక్షాళన లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వర్షాకాలంలో పంట పొలాలు ముంపు బారిన పడి తీవ్ర నష్టం ఎదుర్కోడంతో అప్పుల బారిన పడిన కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ఉండి ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు సూచనలతో పంట కాలువల ప్రక్షాళన చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ ఫణి శంకర్, ఉండి డిసి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బిల్లుల చెల్లింపులో జాప్యం..!

అంగన్‌వాడీల ఆవేదన

ప్రజాశక్తి - ఉండి

అంగన్‌వాడీలకు గత కొన్ని నెలల నుంచి భవనాల అద్దెలు, కూరగాయల ఖర్చులు మొదలైన వాటి బిల్లులు చెల్లించడంలో సంబంధిత అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని మండలానికి చెందిన కొందరు అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తమకు సరైన వేతనాలు లేక ధర్నాలు చేసినప్పటికీ ఆ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం 11 వేల రూపాయల జీతంతో పాఠశాల అద్దెలు, కరెంట్ బిల్లులు, కూరగాయల బిల్లులు చెల్లిస్తున్నామని, సంబంధిత అధికారులు తమకు రావాల్సిన బిల్లులను రప్పించాలని వారు కోరుతున్నారు.

ఊరంతా విందు.. ఎంతో కనువిందు..

ఉప్పరగూడెంలో ఊరి భోజనం

గ్రామస్తులంతా ఒక్కో వంటకం చేసి తెస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో గురువారం ఊరి భోజనం కనువిందు చేసింది. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఒక్కో ఐటమ్ చేసుకుని గ్రామమంతా కలిసి ఒకేచోట చేసే భోజనం చేస్తారు. ఈ భోజనం తినేందుకు ఆ గ్రామానికి చెందినవారు జిల్లాలో కాదు రాష్ట్రంలో ఎక్కడున్నా జనవరి 2వ తేదీన ఇక్కడికి వచ్చి చేరతారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఒకరు బూరి, ఒకరు గారె, ఒకరు కాజా, మరొకరు అద్దా ఇలా ఆకు నిండుగా అన్నీ పదార్థాలు వేసి పెట్టి కడుపు నిండగా పెట్టి పంపిస్తారు. మండలంలోని ఉప్పరగూడెంలో ఇది ప్రత్యేకత. ఈ కార్యక్రమాన్ని గ్రామంలోని జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో యువత వేడుకగా చేసుకుంటారు. ప్రతి ఇంట్లో మహిళలతో పాటు అవ్వ, తాత చిన్నారులు అంతా సరదాగా ఈ రోజు గడుపుతారు. ఈ విందు భోజనంలో వడ్డించే పదార్థాలను తినలేక ఇంటికి పట్టుకెళ్లే వారికి కవర్ కూడా ఇవ్వడం కొసమెరుపు.

మంతెన వెంకటరామరాజుకు నివాళి

ఉండి: చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు వర్ధంతి వేడుకలు గురువారం కలిసిపూడిలో మంతెన చంటిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ మంతెన వెంకట రామరాజు మండలంలో ఎన్నో ఆలయాలు నిర్మించారని, మరికొన్ని నిర్మించేందుకు తమవంతు సహకారం అందించారని గుర్తుచేశారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పివిహెచ్ నరసింహారావు, కాగిత తాతయ్య, కందుల శివకృష్ణ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

కోపల్లె హైస్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శనలో బహుమతులందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కాళ్ల

మానవ మనుగడకు విజ్ఞాన శాస్త్రమే మూలమని, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, పరిశోధనా శక్తిని వెలికి తీసేందుకు కోపల్లె హైస్కూల్లో మండలస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఎంఇఒ ఎ.రవీంద్ర తెలిపారు. గురువారం కోపల్లె హైస్కూల్లో విజ్ఞాన సైన్స్ ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఉదయం నుంచి మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించారు. విజేతలకు ఎంఇఒ రవీంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిర్మలాదేవి బహుమతులను ప్రదానం చేశారు. వ్యక్తిగత కేటగిరీలో మొదటి స్థానం కోపల్లె హైస్కూల్ సాధించింది. రెండో స్థానం సీసలి హైస్కూల్, మూడో స్థానం జువ్వలపాలెం హైస్కూల్ సాధించాయి. గ్రూప్ కేటగిరిలో మొదటి స్థానం కాళ్ల హైస్కూల్, రెండో స్థానం బొండాడ హైస్కూల్, మూడో స్థానం మాలవానితిప్ప హైస్కూల్ కైవసం చేసుకున్నాయి. టీచర్ కేటగిరిలో మొదటి స్థానం కలవపూడి హైస్కూల్ ఉపాధ్యాయుడు టి.బాల బాలాజీ, రెండో స్థానం దొడ్డనపూడి హైస్కూల్ ఉపాధ్యాయుడు ఆర్.ధర్మరాజు, మూడో స్థానంలో ఏలూరుపాడు హైస్కూల్ ఉపాధ్యాయిని ఎన్.కళ్యాణి నిలిచారు. విజేతలను మండల అధికారులు, గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు అభినందించారు. మొదటి స్థానంలో నిలిచిన వారు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

ఉండి : విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో తోడ్పాటునిస్తాయని ఎంఇఒ బొల్లిపో జ్యోతి అన్నారు. గురువారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న జ్యోతి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే తయారు చేయబడిన పలు నమూనాలను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.మానస ప్రథమ స్థానంలోనూ, ఎన్ఆర్‌పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.సురేఖ ద్వితీయ స్థానంలోను, తృతీయ స్థానంలో గ్రూప్ క్యాటగిరీకి సంబంధించి వి.వైష్ణవ కుమార్, జెవిఎస్ఎస్.గణేష్ నిలిచారని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారు వీరవాసరంలో జరిగే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 బొక్కా వినాయకుడు, ఉండి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వై.రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొగల్తూరు : విద్యార్థులను సృజనాత్మకతను వెలిగి తీసేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ అన్నారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలను ఎంఇఒ శామ్యూల్, కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వీటిని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. మొగల్తూరుకు చెందిన జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్యక్తిగత విభాగంలో ఎస్‌వివి.సాయికుమార్, సమూహ విభాగంలో వి.శరణ్య, ఓ దివ్యశ్రీయులు, నీటితిప్ప జెడ్‌పి ఉన్నత పాఠశాలలకు చెందిన కె.శ్రీలతాదేవి ఉపాధ్యాయ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారని ఎంఇఒ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి బోణం లక్ష్మీనరసింహారావు, వార్డు మెంబర్ మెట్ల లక్ష్మీ పద్మావతి రాంబాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : గురువారం పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జల్లికొమ్మర యుపి స్కూలు సత్తాచాటిందని గణపవరం ఎంఇఒలు ఐ.రాజేష్, జి.బాలయ్య తెలిపారు. మూడు విభాగాలకు రెండు విభాగాల్లో స్కూలు విద్యార్థి నిమ్మల హనుమ రూపొందించిన మంకీ గన్‌కు ప్రథమస్థానం లభించినట్లు తెలిపారు అలాగే స్కూల్ హెచ్ఎం కె.సుందర్ కుమార్ తయారు చేసిన లైన్ టెస్టర్ మోడల్ జిల్లాకు ఎంపికైనట్లు తెలిపారు. గ్రూప్ కేటగిరీలో కొత్తపల్లి యుపి పాఠశాల విద్యార్థులు వి.శ్రీదేవి, ఎం.తేజస్విని తయారు చేసిన ఆర్గానిక్ సిసట మ్ ఇన్ హ్యూమన్ బాడి గ్రూపు కేటగిరీ జిల్లా కి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 4వ తేదీన వీరవాసరంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో సదరన్ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టును పుంపుతున్నట్లు చెప్పారు

నరసాపురం : పట్టణంలోని వైఎన్ కాలేజీలో గురువారం మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. సైన్స్ ఫెయిర్‌ను ఎంఇఒ పి.పుష్పరాజ్యం ప్రారంభించారు. మండల, అర్బన్‌లకు చెందిన హైస్కూల్ విద్యార్థులు 500 మంది, టీచర్స్ 100 మంది పాల్గొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ స్టూడెండ్, టీచర్, గ్రూప్ కేటగిరిల్లో 68 ప్రదర్శనలు వచ్చాయి. ఈసందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. దీనివల్ల విజ్ఞానం మరింత పెరుగుతుందన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఇఒ పుష్పరాజ్యం సర్టిఫికెట్, షీల్డులు ప్రదానం చేశారు. మహత్మా జ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

నేటి నుంచి 5వ తేదీ వరకూ భీమవరంలో జరగనున్న సిపిఎం 26వ మహాసభను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి పి.మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం వల్లూరులో సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయన్నారు. ఒక పక్క రోజురోజుకూ నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, మరోపక్క కరెంటు ఛార్జీలు పెంచి వేలల్లో బిల్లులు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి ధరలు అదుపులోకి తీసుకురావాలని, ప్రజలపై వేస్తున్న భారాలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని 14 గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భీమవరంలో జరిగే 26వ సిపిఎం జిల్లా మహాసభకు హాజరై విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి షేక్ పాదుషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 3, 4, 5 తేదీల్లో జరిగే మహాసభకు సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. షేక్ పాదుషా మనవరాలు సాయిద స్లాప్పి ఎర్రజెండా నేను సైతం సిపిఎం జెండా పట్టుకుని ఎగురవేస్తుందని తెలిపారు.

ఐలు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తణుకు

న్యాయవాదులకు, కక్షిదారులకు దిక్సూచిగా ఐలు వాల్‌పోస్టర్ ఉపయోగపడుతుందని తణుకు నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రూపొందించిన గోడపత్రికను జిల్లా జడ్జి సత్యవతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - తణుకు

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్) తణుకు డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను గురువారం సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ 74 శాతం, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ 70 శాతం, తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ 86 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ట్రెజరర్ నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వీరవాసరం

నవుడూరు, అండలూరు గ్రామాల్లో ఫీడర్ లైన్ మరమ్మతులు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఇఇ కె.మధుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

పెనుమంట్ర : ఈ నెల 3వ తేదీ శుక్రవారం పెనుమంట్ర మండల పరిధిలో అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ లైన్ మెయింటనెన్స్, చెట్ల కొమ్మలు తొలగించడం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని నరసాపురం విద్యుత్ శాఖ ఎఇ కె.మధుకుమార్ ఒక ప్రకటనలో కోరారు.

గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి - వీరవాసరం

స్థానిక పద్మశాలివీధిలో రెడ్డి వెంకటేశ్వరావుకు చెందిన గడ్డివాము గురువారం దగ్ధమైంది. మంటలు అదుపు చేసేందుకు స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న భీమవరం ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. 15 ఎకరాలకు చెందిన గడ్డికి నిప్పంటుకుందని, సుమారు రూ.80 వేల వరకూ నష్టపోయానని రైతు వాపోయారు. గడ్డివాముకు మంటలు ఎలా వ్యాపించాయో తెలియలేదన్నారు. భీమవరం అగ్నిమాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ కెసిహెచ్.శివరామరెడ్డి నేతృత్వాన సిబ్బంది మంటలు అదుపు చేశారు.

మాధవనాయుడుకు నేతల పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తండ్రి బండారు ప్రతాప్ నాయుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం పెదకార్యం సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంఎల్ఎ వంగవీటి రాధా, ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా), టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, మాజీ ఎంఎల్‌సిలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు వచ్చి ప్రతాప్ నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. మాధవనాయుడును, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

అధికారులకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆదేశం

ప్రజాశక్తి - ఆకివీడు

తమకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని తాళ్లకోడు కాలనీ వాసులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును కోరారు. గురువారం జనసేన నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు రత్నం అభ్యర్థన మేరకు ఆయన కాలనీకి వెళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. తమ కాలనీలో రోడ్లు, విద్యుత్, తాగునీరు సౌకర్యాలు కల్పించాలని కోరారు. తాగునీటి చెరువు ఏర్పాటుకు పరిస్థితులను ఆయన సమీక్షించారు. అయితే అత్యవసర ప్రాతిపదికపై అప్పటికే ఉన్న తాళ్లకోడులోని మంచినీటి చెరువు నుంచి నీరు ఇవ్వొచ్చని గ్రామస్తులు చెప్పారు. అయితే ఆ చెరువుకు వచ్చే నీరురాకకు ఆక్రమణలు అడ్డంగా ఉన్నాయని చెప్పారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని, తాగునీరు ఇచ్చే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ బల్బులు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యలన్నీ పరిష్కరిస్తానని చెప్పారు.

బొలిశెట్టికి 115వ ఛాంబర్ కేటాయింపు

తాడేపల్లిగూడెం: రాష్ట్ర శాసనసభలో విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు 115 వ ఛాంబర్ కేటాయించారు. గతేడాది బొలిశెట్టి శ్రీనివాస్ ప్రభుత్వ విప్‌గా నియమితులైన సంగతి విదితమే. దీంతో ఆయనకు శాసనసభలోని 115వ ఛాంబర్ కేటాయించారు. గురువారం బొలిశెట్టి శ్రీనివాస్ తన ఛాంబర్లోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయనకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాబ్జి, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నరసాపురం: నరసాపురంలోని బస్టాండ్ సమీపంలో 216 జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. నరసాపురం నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న బైక్‌ను, ఆటోను ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి సిఐ బి.యాదగిరి చేరుకుని, ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది

మావుళ్లమ్మ దేవస్థాన నిధుల దోపిడీపై విచారించాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శర్మ, ధనుష్

ప్రజాశక్తి - భీమవరం

ప్రసిద్ధ క్షేత్రం భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థాన అధికారులు స్వర్ణ త్రిశూలం పేరిట యాత్రికుల వద్ద సేకరిస్తున్న బంగారం, వజ్రాభరణాలు, కానుకలను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విచారణ జరిపించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌విఎన్.శర్మ, జి.ధనుష్ కోరారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1984 నుండి మావుళ్లమ్మ దేవస్థానం అధికారులు, ప్రయివేటు వ్యక్తులు కమిటీలుగా ఏర్పడి భక్తుల నుండి స్వర్ణ కిరీటం, కర్ణాభరణాలు, స్వర్ణ నేత్రాలు, స్వర్ణమయ వస్త్రం (బంగారం చీర) పేరుతో పాంప్లెట్లు, పోస్టర్లు, బ్రోచర్లు వేశారని, భక్తులు, దాతల నుండి దాదాపు 200 కేజీల బంగారం, 500 కేజీల వెండితోపాటు విలువైన వజ్రాలు, సుమారు రూ.5 కోట్ల వరకూ రశీదులు లేని విరాళాలు సేకరిస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయని తెలిపారు. ఈ పేరిట అమ్మవారి కానుకలను, కోట్లాది రూపాయల నిధులను పక్కదోవ పట్టిస్తున్నారని ప్రచారం సాగుతోందని పేర్కొన్నారు. సుమారు పదేళ్ల నుంచి ఒకే ఆదాయపు లెక్కలు చూపిస్తూ నిధులను కైంకర్యం చేస్తున్నారని ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ప్రతియేటా మావుళ్లమ్మకు నెల రోజులపాటు జరిగే ఉత్సవాల నిర్వహణ కూడా ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టి ఉత్సవాలకు వస్తున్న హుండీల నిధులతోపాటు అన్నదానం, అర్చకుల పళ్లాల్లో భక్తులు అందజేసే నిధులను కూడా సంబంధిత అధికారులు, ట్రస్ట్ సభ్యులు స్వాహా చేస్తూ వాటాలుగా పంచుకుంటున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయని పేర్కొన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఎసిబి, విజిలెన్స్ అధికారులతో ఈ అవినీతి, అక్రమాల ఆరోపణలపై దర్యాప్తు చేయించాలని, లేనిపక్షంలో హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ,కాకినాడ

O.S.No.863/2024

Between:
దిండి వరలక్ష్మి ...వాది
మరియు
గుడిపూడి రమేష్ బాబు@ రమేష్ ...ప్రతివాది

To
గుడిపూడి రమేష్ బాబు, @ రమేష్, తండ్రి వెంకటరత్నం, వయస్సు 40సం॥లు. పోలీస్ కానిస్టేబుల్, పి.సి.నెం.3428, మందపల్లి గ్రామం, జాలిపూడి పోస్ట్, ఏలూరు రూరల్ మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీహజరు నిమిత్తం **ది.10-01-2025వ** తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **గం॥10.30** ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వింజమూరి వెంకటరావు
అడ్వకేటు,కాకినాడ
సెల్:9866550610

పాస్‌పోర్టు పడిపోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, మెయిన్ రోడ్, వెంకట్రామపురం గ్రామానికి చెందిన గంటా మేరి, భర్త : పౌలు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పాస్పోర్ట్ నెంబర్ : F0680192 గల పాస్పోర్ట్ పెనుగొండ జిరాక్స్ సెంటర్ నుండి వెంకట్రామపురం ఇంటికి వెళ్తుండగా నా యొక్క పాస్పోర్ట్ పడి పోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

గంటా మేరి, భర్త : పౌలు, డోర్ నెం : 1-23
మెయిన్ రోడ్, వెంకట్రామపురం
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా.
సెల్ : 7337228977

పాస్‌పోర్టు పడిపోయినది

పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం, ములపర్రు గ్రామానికి చెందిన ప్రసాద్ మామిడి శెట్టి, తండ్రి : సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. EC పాస్పోర్టు నెంబర్ : X0610733 గల పాస్పోర్ట్ ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళు ండగా నా యొక్క EC పాస్పోర్ట్ పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

అడ్రస్ : **ప్రసాద్ మామిడి శెట్టి**
తండ్రి : సత్యనారాయణ, డోర్‌నెం :1-176
ములపర్రు, పెనుగొండ మండలం,
ప.గో.జిల్లా. సెల్ : 9573518142

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం: 81/2023
ఇన్
ఓ.ఎస్. 323/2022

యడ్లపల్లి సుబ్బారావు ...... డి.హెచ్.ఆర్
వర్సెస్
తమన్న వెంకటమహాలక్ష్మి ..... జె.డి.ఆర్

టు,
జె.డి.ఆర్:
తమన్న వెంకటమహాలక్ష్మి, భర్త: నగేష్
ఇంటి నెం: పిహెచ్‌సి సెంటర్
ప్రస్తుతం నివాసం: తాడిమల్ల (గ్రామము)
నిడదవోలు మండలం, పచ్చిమ గోదావరి జిల్లా.

ఈ నెంబరు డి.హెచ్.ఆర్. నీ తాలూకు జీతమును జప్తు చేసి ఈ నెంబరు డిక్రీ బాకీలోనికి వసూలు ఇప్పించవలసినదిగా కోరుతూ ఈ ఇ.పి.ని దాఖలు చేసియున్నారు. ఇందుకు నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో 10-01-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా కానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 10-01-2025

వి.కాశయ్య, బిఎస్‌సి, బిఇడి, ఎల్‌ఎల్‌బి
డిహెచ్‌ఆర్ తరపు అడ్వకేట్
మార్కాపురం.

MUNICIPAL CORPORATION, ELURU

E-PROCUREMENT TENDER NOTICE

No.92-93/General/2024-25, **Dated : 02.01.2025.**

The Commissioner, Municipal Corporation, Eluru Invites tenders from interested, eligible bidders for **"Providing Balance Work CC road and Providing CC Platform in Municipal Corporation, Eluru"** Total No. of works is 2 with an amount of Rs.17.56 Lakhs.

Tender schedules are available on e-procurement market place from 03.01.2025. Last date of receipt of tenders is 06.01.2025 . Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- Commissioner
Municipal Corporation, Eluru.